సాక్షి
నంద్యాల
మంగళవారం । 2 । జూలై । 2024



**వైభవంగా వెండి రథోత్సవం**

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన పూజలు జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.



**ఆలయ భద్రత మల్లన్నకెరుక!**

శ్రీశైల ఆలయ భద్రతను దేవస్థాన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పర్యవేక్షిస్తుంటారు. ప్రస్తుతం ఈ పోస్టు ఖాళీగా ఉంది. దేవస్థానం నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ఇంతవరకు భర్తీ కాలేదు. 8లో▸



**తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు**

మంత్రాలయం జెడ్పీహైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీ విషయంలో టీడీపీ నాయకుల మధ్య విభేదాలు తలెత్తాయి. ఇరువర్గాలకు చెందిన కార్యకర్తలు తన్నుకున్నారు. 8లో▸

## న్యూస్‌రీల్

### నిజాయితీ చాటిన మీసేవా నిర్వాహకుడు



నగదును అందజేస్తున్న సీఐ రాజారెడ్డి

బొమ్మలసత్రం: పట్టణంలోని స్థానిక ఫైర్‌స్టేషన్ ఎదురుగా ఉన్న మీసేవా నిర్వాహకుడు రామసుబ్బయ్య నిజాయితీ చాటి అభినందనలు అందుకున్నారు. టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన మురళీధర్‌రెడ్డి ఓ ప్రైవేటు కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. సోమవారం బ్యాంక్‌లో రూ.1.50 లక్షలు డ్రా చేసి బ్యాగ్‌తో బయటకు వచ్చారు. అనంతరం ఫైర్‌స్టేషన్ ఎదురుగా ఉన్న మీసేవా కేంద్రంలో ఒక సర్టిఫికెట్ కోసం వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తనతో పాటు తీసుకొచ్చిన నగదు బ్యాగును అక్కడే మరిచిపోయి వెళ్లిపోయాడు. కొంత సేపటి తర్వాత నిర్వాహకుడు బ్యాగును గమనించి అందులో నగదు ఉన్నట్లు గుర్తించి సమీపంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐకి అందజేశాడు. బ్యాగులో ఉన్న బ్యాంక్ పాసుబుక్ ఆధారంగా సీఐ వెంటనే మురళీధర్‌రెడ్డికి సమాచారం అందించడంతో అతను స్టేషన్‌కు వచ్చి నగదు బ్యాగ్‌ను అందుకున్నారు. అనంతరం నిజాయితీ చాటిన మీసేవా నిర్వాహకుడి రామసుబ్బయ్యను అందరూ అభినందించారు.

### నిలకడగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని టెక్కె మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. సోమవారం సూపర్-10 రకం జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.15,500, మధ్యస్థ ధర రూ.12,500, కనిష్ట ధర 9,800గా పలికినట్లు యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.

### ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం జూన్‌లో నిర్వహించిన పది, ఇంటర్ (ఏపీఓఎస్ఎస్) పబ్లిక్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదల చేసినట్లు నంద్యాల జిల్లా ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మీ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షలకు 15,058 మంది విద్యార్థులు హాజరు కాగా 9,531 మంది ఉత్తీర్ణత సాధించగా 63 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. అలాగే ఇంటర్మీడియెట్ పరీక్షకు 27,279 మంది విద్యార్థులు హాజరు కాగా 18,842 మంది ఉత్తీర్ణత పొంది 69.7 శాతం సాధించారన్నారు. ఫలితాలను ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో ఫలితాలను తెలుసుకోవచ్చన్నారు.

### జిల్లాలో మోస్తరు వర్షం



నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా మహానందిలో 24.4 మి.మీ, అత్యల్పంగా అవుకులో 1.4 మి. మీ వర్షం కురిసింది. నందికొట్కూరులో 18.6 మి.మీ శిరివెళ్ల 18.6, శ్రీశైలం 16.4, బండిఆత్మకూరు 16.2, పగిడ్యాల 12.4, జూపాడుబంగ్లా 11.8, కొలిమిగుండ్ల 11.2, ఆత్మకూరు 10.4, కొత్తపల్లె 10.2, కోవెలకుంట్ల 9.6, పాములపాడు 7.8, మిడుతూరు 6.6, ఆళ్లగడ్డ 5.6, నంద్యాల 5.4 , చాగలమర్రి 5.4, గోస్పాడు 5.2, సంజామల 4.8, బనగానపల్లె 4.6 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

### 16 నుంచి కొత్త చట్టాలపై అవగాహన

బొమ్మలసత్రం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త చట్టాలపై జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి ఈనెల 16 నుంచి 30 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అమలైన కొత్త చట్టాలపై ఆదివారం వరకు అన్ని కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరికి ఈనెల 15 రోజుల పాటు వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తామని సూచించారు. ప్రస్తుతం ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత బీఎన్ఎస్ అమలు అయ్యిందన్నారు. ప్రస్తుతం స్టేషన్‌తో సంబంధం లేకుండా బాధితులు ఎక్కడైనా ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత స్టేషన్లకు ఆన్‌లైన్ ద్వారా చేరవేయాలని సూచించారు. పిల్లలు, వికలాంగులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారిని స్టేషన్‌లో విచారించకుండా వారి ఇంటి వద్దే విచారించాలన్నారు.

# ఇంటికి దూరం.. ఇష్టారాజ్యం

- జిల్లాలో అస్తవ్యస్తంగా పింఛన్ల పంపిణీ
- ఇంటి వద్దనే పంపిణీ కేవలం ఫొటోలకే పరిమితం
- అధిక శాతం సచివాలయాలు, రచ్చబండ, కూడళ్లలోనే..
- పంపిణీలో కూటమి నేతల హడావుడి
- సర్వర్లు పని చేయక లబ్ధిదారుల అవస్థలు
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పంపిణీని గుర్తు చేసుకున్న వైనం
- వికలాంగులకు అరియర్స్ పింఛన్ మొత్తం ఇవ్వని ప్రభుత్వం

సాక్షి, నంద్యాల: జిల్లా వ్యాప్తంగా సోమవారం పింఛన్ల పంపిణీ మొదలైంది. పలు గ్రామాల్లో రచ్చబండలు, ఇతర ముఖ్యమైన కూడళ్లకు రప్పించి పంపిణీ చేయడం చూసి పింఛనుదారులు నోరెళ్లబెట్టారు. పడిగాపులు కాసి అతి కష్టం మీద పింఛన్లు తీసుకోవాల్సి వచ్చింది. మొత్తంగా ఈ పంపిణీ టీడీపీ కార్యక్రమాన్ని తలపించింది. ప్రజాప్రతినిధులు పింఛన్లు పంపిణీ చేసినా సరేకానీ, పార్టీ నాయకులు కూడా ఇది తమ హక్కు అన్నట్లుగా వ్యవహరించడం గమనార్హం. జూలై నెల పింఛన్లు ఇంటి దగ్గరే సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేస్తామని ప్రభుత్వం హడావుడి చేసింది. అయితే పంపిణీ కార్యక్రమం జరిగిన తీరును పరిశీలిస్తే అదంతా ఒట్టిదేనని తేలిపోయింది. ఎమ్మెల్యేలు, ఎంపీ, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు కొద్ది మందికి ఇంటి దగ్గర పింఛన్లు పంపిణీ చేసి ఫొటోలు దిగి వెళ్లిపోయారు. ఆ తర్వాత పింపిణీ స్వరూపం మారిపోయింది. సచివాలయాలు లేదా రచ్చబండ లేదా ఒక కూడలిలో కూర్చొని పంపిణీ చేయడం ఆశ్చర్యానికి గురిచేసింది. వేలాది మంది వికలాంగులు, వృద్ధులు, వ్యాధిగ్రస్తుల ఇళ్లకు పింఛన్ సొమ్ము ఇవ్వడానికి ఎవ్వరూ రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద జిల్లాలో 2,21,240 మంది పింఛన్‌దారులకు పంపిణీ చేశారు. సోమవారం నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం వీధి, నంద్యాల మండలంలోని చాపిరేవుల గ్రామంలో పింఛన్ల పంపిణీలో కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల బకాయిలతో కలిపి జిల్లాలో రూ.150.23 కోట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంటి దగ్గరే పింఛన్లు అన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలకు సంబంధించిన అరియర్స్ కూడా ఇస్తామన్నారు. సచివాలయ ఉద్యోగులు, అవసరమైన అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లను కూడా పింఛన్ల పంపిణీకి వినియోగించుకుంటామన్నారు. ఉదయం 6 గంటలకు మొదలుపెట్టి, సాయంత్రం 6లోపు పంపిణీ చేస్తామని ప్రగల్భాలు పలికారు. నిజమేనని నమ్మిన అవ్వాతాతలు, దివ్యాంగులకు టీడీపీ ప్రభుత్వంలో అందుకుంటున్న మొదటి పింఛను విషయంలోనే నిరాశ ఎదురైంది. సచివాలయ ఉద్యోగుల సహకారం అంతంత మాత్రమే ఉండగా.. టీడీపీ నేతల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను తీసుకోవాల్సిన దుస్థితి కనిపించింది. సర్వర్ సమస్య ఉందని, మరుసటి రోజు సచివాలయాల వద్దకు వచ్చి తీసుకోండనే మాటలతో లబ్ధిదారులు నిట్టూర్చారు. ఇక అరియర్స్ విషయంలో దివ్యాంగులకు మొండిచేయి చూపడం గమనార్హం.



దొర్నిపాడు మండలం డబ్బ్యా గోవిందిన్నె హెల్త్ సెంటర్‌లో లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రతి 50 ఇళ్లను క్లస్టర్‌గా మ్యాపింగ్ చేసి ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేశామని చెప్పారు.

**గతంలో వలంటీర్లు ఉదయమే ఇచ్చేవారు..**

టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన మొదటి నెలలో జరిగిన పింఛన్ల పంపిణీని చూసి పలువురు ఆందోళనకు గురయ్యారు. ఉదయం ఆరు గంటల నుంచే ఇంటి దగ్గర పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పినా సాయంత్రం వరకు కూడా మా దగ్గరకు ఎవరూ రాలేదని వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఉదయం 6 గంటలకే వలంటీర్లు వచ్చి పింఛను సొమ్ము అందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు.

**నమ్మించి మోసం చేశారు..**

ఉమ్మడి జిల్లాలో 4,66,469 పింఛన్ల పంపిణీకి నిధులు విడుదలయ్యాయి. ఇందులో 11 కేటగిరీలకు చెందిన 3,99,455 మందికి పింఛను మొత్తం రూ.4వేలకు పెరిగింది. 59,544 మంది వివిధ కేటగిరిలకు చెందిన వారికి కూడా పింఛను మొత్తం పెరిగింది. అయితే ఉమ్మడి జిల్లాలో 7,470 మందికి మాత్రం పింఛను సొమ్ములో ఎలాంటి మార్పు లేదు. ఈ నేపథ్యంలో నమ్మించి మోసం చేశారంటే పింఛనుదారులు ఆందోళన వ్యక్తం చేశారు. 3.99 లక్షల మంది అరియర్స్‌తో సహా రూ.7 వేలు తీసుకుంటే.. 59,544 మంది పెంచిన పింఛను సొమ్మును అందుకున్నారు. మిగిలిన ఉమ్మడి జిల్లాలో 7,470 మందికి మాత్రం తీవ్ర నిరాశ మిగిలింది.. కర్నూలు జిల్లాలో 2,911 మందికి, నంద్యాల జిల్లాలో 4,559 మందికి పింఛను సొమ్ము పెంపులో మొండిచేయి ఎదురైంది.

**దివ్యాంగులకు మొండిచెయ్యి**

ఎన్నికల ప్రచారంలో భాగంగా పింఛన్ మొత్తాన్ని రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడంతో పాటు పెంచిన మొత్తాన్ని ఏప్రిల్ నుంచే అందజేస్తామని సీఎం చంద్రబాబునాయుడు వాగ్దానం చేశారు. దివ్యాంగులకు ఇచ్చే రూ.3 వేల పింఛన్‌ను రెట్టింపు చేస్తామని చెప్పారు. జిల్లాలో 26,107 మంది దివ్యాంగులున్నారు. వీరంతా తమకు కూడా ఏప్రిల్ నుంచి పెంచిన మొత్తాన్ని అరియర్స్‌తో కలిపి అందజేస్తారని ఆశపడ్డారు. కానీ, కేవలం రూ.6 వేలే చేతిలో పెట్టడంతో నిరాశచెందారు.



జూపాడుబంగ్లా సచివాలయం-2లో సర్వర్ పనిచేయక నిలిచిన పింఛన్ల పంపిణీ

**మంగళవారం మీరే రండి..**

ఇంటి దగ్గరే పింఛన్లు పంపిణీ చేయాల్సిన ఉద్యోగులే స్వయంగా సచివాలయాలకు వచ్చి పింఛన్లు తీసుకోండని చెప్పడం సర్వత్రా విమర్శలకు దారి తీసింది. ఇంటి దగ్గరకు వచ్చి పింఛన్లు ఇస్తారని వందలాది మంది ఎదురు చూశారు. కనుచూపు మేరలో ఇంటి దగ్గర పింఛన్ల పంపిణీ చేయడం కనిపించకపోవడంతో కొంతమంది సచివాలయాలకు వెళ్లి ఆరా తీశారు. సర్వర్ పనిచేయడం లేదు.. మంగళవారం సచివాలయానికే వచ్చి పింఛను తీసుకోండని చెప్పడం గమనార్హం. నందికొట్కూరు, శ్రీశైలం, ఆత్మకూరు, ఆళ్లగడ్డ తదితర మండలాల్లో సర్వర్ సమస్య తీవ్రమై లబ్ధిదారులు అవస్థలు పడ్డారు. సర్వర్‌పై ఒత్తిడి పెరగడంతో పింఛన్ల పంపిణీ ప్రారంభమైన గంటకే సర్వర్ మొరాయించడం ప్రారంభమైంది. కొన్ని గ్రామాల్లో సిగ్నల్స్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకోవాలని చెప్పడాన్ని బట్టి చూస్తే 2019 సంవత్సరానికి ముందున్న పరిస్థితులే ఏర్పడుతున్నాయని పింఛన్‌దారులు ఆందోళన చెందుతున్నారు.

**చాలా ఇబ్బంది పడ్డా**



ఉదయం ఇంటి దగ్గరకు వచ్చి పింఛన్ ఇస్తామని చెప్పారు. ఎవరూ రాలేదు. తర్వాత సచివాలయం వద్ద ఇస్తామన్నారు. అక్కడ.. ఇక్కడా అంటూ తిప్పారు. ఎవ్వరిని అడగాలో అర్థం కావడం లేదు. సర్వర్ పని చేయలేదని చెప్పారు. చివరకు సాయంత్రానికి ఓ చెట్టు కింద ఇచ్చారు. ఈ నెల పింఛన్ తీసుకునేందుకు చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది.

– ముంతాజ్, మిట్టకందాల, పాములపాడు మండలం

**దివ్యాంగులకు అరియర్స్ ఇవ్వాలి**



నా కొడుకు ముర్తుజావలి మానసిక వికలాంగుడు. పింఛన్ లబ్ధిదారులకు మూడు నెలల నుంచి పెంచిన పింఛన్ అని రూ. 3000, ఈ నెల రూ.4000 కలిసి రూ.7000 ఇచ్చారు. దివ్యాంగులకు రూ. 6వేలు ఇచ్చారు. మరి గడిచిన 3 నెలల పింఛన్ రూ.9వేలు ఎందుకు ఇవ్వలేదో అర్థం కాలేదు. అడిగేందుకు సచివాలయం వద్దకు వచ్చాను. ప్రభుత్వం దివ్యాంగులకు అరియర్స్ ఇవ్వాల్సిందే.

– గూడ్ బై, మిట్టకందాల, పాములపాడు మండలం



రుద్రవరం మండలం ఆలమూరు సచివాలయం వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

**పెత్తనం చెలాయిస్తూ..**

పింఛన్ల పండుగలో నేతల జోక్యం శ్రుతిమించింది. 'మమ్మల్ని ఆపేదవరూ'.. అంటూ పంపిణీలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అధికారులు, సచివాలయ సిబ్బందిని పక్కన పెట్టి ఎటువంటి అర్హత లేని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పంపిణీలో పాల్గొని హడావుడి చేశారు. ప్రజా ప్రతినిధులు నియోజకవర్గ కేంద్రాల్లో పంపిణీ చేయగా.. మండలాలు.. గ్రామాల్లో ఆ పార్టీ చోటా మోటా నేతలు పింఛన్లను పంపిణీ చేశారు. ఏ అధికార హోదా లేకున్నా పెత్తనం చెలాయించారు. బనగానపల్లె నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీలో భాగంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి ఇందిరా రెడ్డి ఒకే చోటకు లబ్ధిదారులను పిలిపించి అందజేశారు. మరోవైపు నంద్యాలలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తనయుడు ఎన్ఎండీ ఫిరోజ్ కూడా అధికార సిబ్బందిని పక్కకు నెట్టేసి, అన్నీ తానై పాల్గొన్నారు.



డోన్ శ్రీరామ్‌నగర్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ శ్రేణులు



నంద్యాలమండలం భీమవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్ తనయుడు ఎన్ఎండీ ఫిరోజ్



శిరివెళ్ల మండలం గుండంపాడులో ఆటోలో నుంచే పింఛన్ అందజేస్తున్న జనసేన కార్యకర్త

# వైద్యులు దేవుడితో సమానం

నంద్యాల టౌన్: రోగి ప్రాణాలు కాపాడానికి శాయశక్తుల ప్రయత్నం చేసే వైద్యులు దేవుడితో సమానమని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం ఐఎంఏ నంద్యాల ఆధ్వర్యంలో స్థానిక సూరజ్ గ్రాండ్ హోటల్‌లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ వసుధ అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ పనిల్ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, గౌరవ అతిథిగా రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు రవికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల వైద్యులు సేవా దృక్పథంతో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రవికృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ దేశంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 100 బ్రాంచ్‌లలో ఇరవై ఒక్క వేల మంది ఐఎంఏ సభ్యులు అటు ప్రభుత్వ రంగంలో, ప్రైవేటు రంగంలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. అనంతరం డాక్టర్లు లక్ష్మయ్య, సుసుమా, శ్రీనివాస్, ధనలక్ష్మీలకు ఐఎంఏ పురస్కారాలు అందజేశారు. వైద్యులు, వైద్యుల కుటుంబ సభ్యులకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్, ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ పీఎస్ శర్మ, డాక్టర్లు నర్మద, నాగమణి, లక్ష్మీ సౌజన్య, హరిత, కల్పన, అరుణకుమారి, శైలజ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న మంత్రి ఫరూక్, ఐఎంఏ వైద్య బృందం

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో టోకరా

బొమ్మలసత్రం: సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి తనను మోసం చేశాడని నంద్యాల పట్టణానికి చెందిన షేక్ అన్వర్‌బాషా ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 52 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించామని, వాటిలో కొన్నింటిని వెంటనే పరిష్కరించామని, మరికొన్నింటిని ఆయా స్టేషన్ అధికారులకు రెఫర్ చేశామన్నారు. ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు తదితర సమస్యలు అధికంగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో సీఐలు రవీంద్ర, సూర్యమౌళి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- పట్టణానికి చెందిన షేక్ అన్వర్‌బాషా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం పట్టణంలోని రియల్ టైమ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు నాగేంద్రబాబును సంప్రదించాడు. రూ. 2.50 లక్షలు తీసుకుని ఢిల్లీలోని సినెర్జిక్స్ అనే కంపెనీలో ఉద్యోగం ఇప్పించాడు. అయితే ఉద్యోగంలో చేరిన అన్వర్‌బాషాకు ఒక నెల జీతం చెల్లించిన కంపెనీ నిర్వాహకులు బోర్డు తిప్పేసింది. అయితే తాను చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని నాగేంద్రబాబును కోరినా స్పందించకపోవడంతో బాధితుడు న్యాయం కోసం ఎస్పీకి వినతి పత్రం అందజేశారు.





ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

- సంజామల మండలం పేరుసోమల గ్రామానికి చెందిన ఆజ్విరా సాహెబ్ అనే వృద్ధుడు తన ఇద్దరు కుమారులకు పెద్దల నుంచి సంక్రమించిన ఆస్తిని సమానంగా పంచాడు. ఒక ఎకరం భూమిని తన జీవనం కోసం ఉంచుకున్నాడు. అయితే ఆభూమి కోసం తన ఇద్దరు కుమారులు ప్రతి రోజు మానసికంగా హింసిస్తున్నారని, వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని బాధితుడు ఎస్పీని కోరాడు.
- పట్టణానికి చెందిన మేడం శివరామిరెడ్డి సాయిబాబానగర్‌లో 5 సెంట్ల భూమిని గత ఏడేళ్ల క్రితం రూ.20 లక్షలతో కొనుగోలు చేశాడు. అయితే తనకు భూమిని విక్రయించిన కరణం రామ్మోహన్, రాజేష్ మళ్లీ వేరొకరికి తప్పుడూ రిజిస్టర్ చేశాడు. దీంతో శివరామిరెడ్డి తనకు న్యాయం చేసి చెల్లించిన డబ్బులు తిరిగి ఇప్పించాలని ఎస్పీని కోరారు.

# ప్రజా అర్జీలను గడువులోగా పరిష్కరించండి

- పీజీఆర్ఎస్‌కు 104 వినతులు
- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ – పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 104 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పద్మజ అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ప్రతి దరఖాస్తును సీరియస్‌గా తీసుకొని నిర్ణీత కాలపరిధిలోగా పరిష్కరించాలన్నారు. తమ పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పీజీఆర్ఎస్ సమస్యలను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలని సూచించారు. బడ్జెట్‌తో కూడిన సమస్యల మినహా పరిష్కరించదగ్గ సమస్యలను ఏ మాత్రం జాప్యం చేయకుండా వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి దరఖాస్తులు వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

**వినతుల్లో కొన్ని..**

- నందికొట్కూరు మండలం ఏబీఎం పాలెం గ్రామ పొలిమేరలో సర్వే నంబర్ 262లో తనకు 0.72 ఎకరాల భూమి ఉందని, పక్క పొలం వారు 20 సెంట్ల భూమిని ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని గ్రామానికి చెందిన రాణి పుష్పలీలా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. తమ పొలాన్ని పరిశీలించి ఆన్‌లైన్‌లో పట్టా పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరారు.
- ఆయా కాంట్రాక్ట్ ఏజెన్సీలు నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదని, సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లాలోని వైద్య కళాశాల, ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రులలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ షిఫ్ట్ కంట్రోల్ సిబ్బంది కలెక్టర్‌కు విన్నవించారు.
- తాను హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుడనని, ఆర్థిక ఇబ్బందులతో ఖరీదైన మందులు వాడలేక పోతున్నానని, పెన్షన్ పథకం కింద పెన్షన్ ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ డోన్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

**మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించండి**

పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పద్మజ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ పీడీ నిర్మల తదితర అధికారులతో కలసి కలెక్టర్ మహిళలపై లైంగిక వేధింపుల చట్టం కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ, మండల, గ్రామస్థాయిలో కార్యాలయాల్లో పదిమంది మహిళలకు మించి ఒకే చోట పని చేస్తుంటే సంబంధిత శాఖలో ఇంటర్నల్ కంప్లెంట్ కమిటీని ఏర్పాటు చేసి మంగళవారం సాయంత్రం లోపుగా నివేదిక ఇవ్వాలన్నారు. ఒకవేళ కమిటీని ఏర్పాటు చేయకపోతే రూ.50వేలు అపరాధ రుసుం కూడా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేట్ సెక్టార్లు, స్వచ్ఛంద సంస్థలు, నర్సింగ్ హోమ్‌లు, పరిశ్రమలు, క్రీడా సంస్థలు, హాస్పిటల్స్, విద్యాసంస్థలు, కార్పొరేషన్లు, స్వయం ఉపాధిలో మరి ఏ ఇతర పని చేసిన ప్రదేశమైన పదిమంది కంటే తక్కువగా ఉన్న సరే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారందరిపై లైంగిక వేధింపుల చట్టం వర్తిస్తుందన్నారు. లోకల్ కంప్లైంట్ కమిటీ జిల్లా స్థాయిలో ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పనిచేస్తూ లైంగిక వేధింపులకు గురి అయితే లోకల్ కంప్లైంట్ కమిటీ ద్వారా పరిష్కారం చేస్తామన్నారు.

# పట్టపగలు చోరీకి యత్నం

- ఆరుగురు దొంగలు పరారీ
- గ్రామస్తులకు చిక్కిన ఓ దొంగ
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

బొమ్మలసత్రం: నంద్యాల మండలం వెంకటేశ్వరాపురం గ్రామంలో సోమవారం ఓ ఇంట్లో పట్టపగలే చోరీకి యత్నించిన దొంగను గ్రామస్తులు పట్టుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వెంకటేశ్వరాపురం గ్రామంలో ఉసేనమ్మ అనే మహిళ కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంది. ఉసేనమ్మ కుటుంబ సభ్యులు పనిమీద నంద్యాల పట్టణానికి వెళ్లడంతో తాను గ్రామంలో ఏర్పాటు చేసుకున్న కూరగాయల దుకాణం వద్ద ఉంది. మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లగా తాళం పగులగొట్టి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించింది. ఇంట్లోకి వెళ్లి చూస్తే ఏడుగురు గుర్తు తెలియని దొంగలు వస్తువులు శోధిస్తుండగా గట్టిగా కేకలు వేయడంతో వారు పరారయ్యారు. స్థానికులు అక్కడికి చేరుకుని దొంగలను వెండించారు. ఆరుగురు దొంగలు పరారీ కాగా ఒక్కడు గ్రామస్తుల చేతికి దొరికాడు. దొంగను తప్పించుకోకుండా చెట్టుకు కట్టి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



దొంగను చెట్టుకు కట్టేసిన దృశ్యం

## క్లుప్తంగా

### మార్కెట్ కమిటీలకు పర్సన్ ఇన్‌చార్జీల నియామకం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా.. ఎన్నికలకు ముందు కొన్ని, ఎన్నికల కోడ్ సమయంలో మరికొన్ని మార్కెట్ కమిటీలకు పాలకవర్గాల పదవీ కాలం పూర్తయింది. మిగిలిన వాటికి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత పాలక వర్గాలు రద్దు అయ్యాయి. తాజాగా మార్కెట్ కమిటీలకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తూ మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు, ఆదోని, నంద్యాల మార్కెట్ కమిటీలకు రాయలసీమ జోన్ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు పర్సన్ ఇన్‌చార్జీగా వ్యవహరిస్తారు. ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీకి ఎన్నికలకు ముందు నుంచే మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీకాంత్ రెడ్డి పర్సన్ ఇన్‌చార్జీగా కొనసాగుతున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని మిగిలిన మార్కెట్ కమిటీలకు ఆయా జిల్లాలో మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పర్సన్ ఇన్‌చార్జీలుగా వ్యవహస్తారు. పాలక వర్గాలకు ఉన్న అధికారాలన్నీ పర్సన్ ఇన్‌చార్జీలకు ఉంటాయి.

### మద్యానికి బానిసై ఆత్మహత్య


రామాంజనేయులు

కర్నూలు: మద్యానికి బానిసై కమ్మరి రామాంజనేయులు (38) అనే వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కల్లూరులోని గుత్తి పెట్రోల్ బంకు వద్ద అరుణా నగర్‌లో రామాంజనేయులు, మహేశ్వరి దంపతులు నివాసముంటున్నారు. రామాంజనేయులు భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేసేవాడు. అక్కడ పనిలేనప్పుడు రూబీ సబ్బుల ఫ్యాక్టరీకి సంబంధించిన లారీ క్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వీరికి శ్రావణి, నాగచరణ్ తేజ సంతానం. కొంతకాలంగా రామాంజనేయులు మద్యానికి బానిసై కుటుంబ పోషణ పట్టించుకునేవాడు కాదు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగేది. ఆదివారం రాత్రి కూడా రామాంజనేయులు మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య, పిల్లలతో గొడవ పడ్డాడు. ఇలా అయితే తాను ఇంట్లో ఉండనంటూ పిల్లలను తీసుకుని ఆమె బయటకు వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రామాంజనేయులు మద్యం మత్తులో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. భర్త తమ్ముడి ద్వారా విషయం తెలుసుకున్న మహేశ్వరి ఇంటికి వచ్చి ఇరుగు పొరుగు సాయంతో తలుపులు బద్దలు కొట్టి గదిలోకి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. కిందికి దింపి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మద్యం మానుకోమని చెప్పినందుకు తనతో గొడవ పడి క్షణికావేశంలో ఉరి వేసుకున్నట్లు భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు.

### విద్యుదాఘాతంతో గనికార్మికుడి మృతి


మృతి చెందిన వడ్డె రమేష్

బనగానపల్లె రూరల్: రామకృష్ణాపురం గ్రామంలో సోమవారం ఓ గనికార్మికుడు ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్ఐ తిరుపాల్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన డి.వడ్డే రమేష్ (28), మమత దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. దంపతులిద్దరూ గ్రామానికి చెందిన సూరికి చెందిన నాపరాతి గనిలో కార్మికులుగా పని చేస్తున్నారు. ఇదే గనిలో గ్రామానికి చెందిన నాగరాజు, రమేష్ గనిలో కటింగ్ మిషన్ ద్వారా నాపరాయి కట్ చేసే పనిలో ఉన్నారు. అయితే విద్యుత్ తీగ కటింగ్ మిషన్‌కు అడ్డుగా ఉండడంతో తీగను పక్కకు తీసేందుకు వడ్డే రమేష్ పట్టుకోవడంతో షాక్ గురై అపస్మారకస్థితికి చేరుకున్నాడు. చికిత్స కోసం బనగానపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

# ఆలయ భద్రత మల్లన్నకెరుక!

- సంవత్సరంపైగా ఖాళీగా ఉన్న సీఎస్ఓ పోస్టు
- దేవస్థాన పర్యవేక్షకులకు అదనపు బాధ్యతలు
- గాడితప్పుతున్న 'సెక్యూరిటీ' విధుల పర్యవేక్షణ


శ్రీశైల ఆలయం


విధులకు హాజరైన సెక్యూరిటీ గార్డులు

శ్రీశైలంటెంపుల్: రాష్ట్రంలోని అతిపెద్ద పుణ్యక్షేత్రాల్లో శ్రీశైలం రెండోది. రోజూ వేల మంది భక్తులు ఇక్కడికి వస్తుంటారు. శ్రీశైల ఆలయ భద్రత, దేవస్థాన రక్షణ బాధ్యతలు దేవస్థాన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పర్యవేక్షిస్తుంటారు. ప్రస్తుతం ఈ పోస్టు ఖాళీగా ఉంది. దేవస్థాన పర్యవేక్షకులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పటించారు. రిటైర్డ్ డీఎస్పీ స్థాయి, అపై స్థాయి అధికారిని సీఎస్ఓగా నియమించుకునేందుకు దేవస్థానం నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ఇంతవరకు భర్తీ కాలేదు. దేవస్థానానికి ప్రత్యేకంగా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ లేకపోవడంతో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. 'సెక్యూరిటీ' విధుల పర్యవేక్షణ గాడితప్పుతోంది. శ్రీశైల క్షేత్రంలో భద్రత కోసం 150మంది సెక్యూరిటీ గార్డులు, 50మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడం, భద్రత పరంగా ఆలయంలోకి సెల్‌ఫోన్లు, పేలుడు పదార్థాలు, నిషేధిత వస్తువులను తీసుకెళ్లకుండా తనిఖీలు నిర్వహించడం, టికెట్టు కౌంటర్ల వద్ద రద్దీ క్రమబద్ధీకరించడం, దేవస్థాన భూములు, ఆస్తుల పరిరక్షణ, అసాంఘిక శక్తులు ఆలయంలోకి చొరబడకుండా అరికట్టడం వీరి ప్రధాన విధులు. వీరి పనితీరును సీఎస్ఓ పర్యవేక్షిస్తుంటారు. ఆలయ భద్రతకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటారు.

**సంవత్సరం పైగా ఖాళీగా..**

గతంలో పనిచేసిన సీఎస్ఓ రెండు సంవత్సరాల కాల పరిమితి 2022 డిసెంబర్ 27వ తేదీతో పూర్తయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు సంవత్సరం ఆరు నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. శ్రీశైల దేవస్థానానికి సీఎస్ఏ పోస్టును ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయాలని దేవదాయశాఖ ఆదేశించింది. ఈమేరకు 2023 ఫిబ్రవరి 1వ తేదీన దేవస్థానం నోటిఫికేషన్ జారీ చేసింది. కనీసం ఐదు సంవత్సరాలు డీఎస్పీ హోదాలో విధులు నిర్వహించి, పదవీ విరమణ చేసి, 65 ఏళ్ల వయస్సు కలిగిన హిందువు, దైవభక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఉచిత వసతి, వాహన సౌకర్యంతో పాటు ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వేతనం నిర్ణయిస్తామని నోటిఫికేషన్‌లో తెలిపారు. సీఎస్ఓ పోస్టుకు సుమారు ఎమనిది దరఖాస్తులు వచ్చాయి. వాటిలో రిటైర్డ్ ఆడిషనల్ ఎస్పీ స్థాయి అధికారిని సీఎస్ఓగా ఎంపిక చేశారు. అయినప్పటికీ ఇంత వరకు బాధ్యతలు చేపట్టలేదు. దీంతో క్షేత్ర భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

**త్వరలో భర్తీ చేస్తాం**



శ్రీశైల దేవస్థాన భద్రత అత్యంత ముఖ్యమైనది. ఇందుకోసం రిటైర్డ్ డీఎస్పీ స్థాయి అధికారిని భద్రతాధికారిగా నియమించుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేశాం. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో సీఎస్ఓ నియామకం జరిగింది. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారిని ఎంపిక చేశారు. వేతనం విషయంపై దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిక పంపాం. అక్కడి నుంచి అనుమతులు రాగానే సీఎస్ఓ పోస్టును భర్తీ చేస్తాం.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

### ఉచిత స్మార్త విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: అనంత సుబ్రమణ్యం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాగ్దేవి స్మార్త వేద పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. పాఠశాలలో ప్రవేశం పొందేందుకు అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి నాలుగు సంవత్సరాల స్మార్త విద్యను ఉచితంగా నేర్పిస్తామని పేర్కొన్నారు. కర్నూలు శివారులోని గోదాగోకులంలో ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు లిఖిత పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. 8 నుంచి 13 సంవత్సరాల లోపు వయసు ఉండి ఉపనయనం అయిన బ్రాహ్మణ విద్యార్థులు అర్హులని తెలిపారు. వివరాలకు దినేష్ స్వామి 95506 29659, రంగస్వామి 81212 27855, అనంత అనిల్ కుమార్ 94401 20488 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



కర్నూలు: నగరంలోని ఆనంద్ థియేటర్ సమీపంలోని హంద్రీ బ్రిడ్జిపై గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్టేషన్ సూపరింటెండెంట్ నాగరాజుకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఆయన ఫిర్యాదు మేరకు కర్నూలు రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ కోదండ రాముడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ప్రమాదంలో తల భాగం సగం తెగిపోవడంతో ముఖం గుర్తు పట్టని విధంగా ఉంది. సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుంది. నలుపు రంగు గల అద్దం, నిలువు గీతలు గల లైట్ క్రీం కలర్ షర్టు, పూల అడ్డపంచ, బ్రౌన్ కలర్ డ్రాయర్ ధరించాడు. డ్రాయర్‌పై ఆర్తి విమల్ 90 సిఎం అనే అక్షరాలు ఉన్నాయి. రెండు పొరల ఎర్రటి మొలతాడు, కుడి చేతికి కాషాయ దారం కట్టుకున్నాడు. 5.6 అడుగుల ఎత్తు, తెలుపు వర్ణం ఉంటాడు. వీపు భాగంలో కుడి వైపున, కుడి కన్ను కింద నల్లటి పుట్టుమచ్చలు ఉన్నాయి. ఆచూకీ తెలిసినవారు 94419 70940 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ కోదండరాముడు విజ్ఞప్తి చేశారు.

## నూతన చట్టాలపై అవగాహన ముఖ్యం

- ఎస్పీ కృష్ణకాంత్


మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కృష్ణకాంత్ మాట్లాడుతూ.. ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించడం, బాధితులకు న్యాయం చేయడమే నూతన చట్టాల ముఖ్య ఉద్దేశమన్నారు. జీరో ఎఫ్ఐఆర్, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు, ఈ-మెయిల్స్, ఎస్ఎంఎస్ లాంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో సమన్లు జారీ వంటి అత్యాధునిక విధానాలు న్యాయ వ్యవస్థలోకి వచ్చాయన్నారు. ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానాల్లో కొత్తగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్యం అధినియం చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. బాధితులకు వేగవంతమైన న్యాయం అందించేందుకు వీలుగా కొత్త క్రిమినల్ చట్టాల్లో కీలక మార్పులు వచ్చాయన్నారు. వీటిపై విద్యార్థులు, ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బందికి ఈ చట్టాలపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. నూతన చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, వాటిని అనుసరిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, కర్నూలు రూరల్ సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, ఉలిందకొండ ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

## తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు

- మధ్యాహ్న భోజనం విషయంలో రగడ
- పాఠశాల ఆవరణలో ఉద్రిక్తత

మంత్రాలయం: టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఎన్నికల ముందు నుంచే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, టీడీపీ నేత ఎన్.రాఘవేంద్రరెడ్డి మధ్య వర్గపోరు సాగుతూనే ఉంది. గతంలో టీడీపీ నేత లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా కోసిగి మండల కేంద్రంలో ఇరువర్గాలు కర్రలతో కొట్టుకున్నారు. తాజాగా సోమవారం మధ్యాహ్న భోజన విషయంలో తెలుగు తమ్ముళ్లు తన్నుకున్నారు. మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీ విషయంలో తిక్కారెడ్డి అనుచరులు, రాఘవేంద్రరెడ్డి వర్గీయులు తీవ్ర గొడవ చోటు చేసుకుంది. పాఠశాలలో వంట చేసేందుకు మొదట రాఘవేంద్రరెడ్డి వర్గీయులు అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న తిక్కారెడ్డి వర్గీయులు అక్కడికి చేరుకుని వంట చేయకుండా అడ్డుపడ్డారు. వంట సామగ్రి లాగి విసరడంతో విషయం రాఘవేంద్రరెడ్డి వర్గీయకులకు చేరవేశారు. వెంటనే రాఘవేంద్రరెడ్డి సోదరుడు రామకృష్ణారెడ్డి అక్కడికి చేరుకుని గొడవకు దిగారు. మాట మాట పెరిగి ఒకరిపై ఒకరు చెయ్యి చేసుకున్నారు. తిక్కారెడ్డి అనుచరుడు విజయ్ రామిరెడ్డిని రాఘవేంద్రరెడ్డి సోదరుడు రామకృష్ణారెడ్డి తన అనచరులతో కలిసి మైదానంలో దాడి చేశారు. పోలీసులు ఎంతగా సర్దిచెప్పినా పట్టించుకోకుండా ఇరువర్గాల నేతలు, కార్యకర్తలు పిడిగుద్దులు గుద్దుకున్నారు. పాఠశాల మైదానంలో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. బాధితుడు విజయ్‌రామిరెడ్డి పోలీస్ స్టేషన్ చేరుకుని రాఘవేంద్రరెడ్డి వర్గీయులపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించి ఎస్ఐ గోపీనాథ్ దర్యాప్తు చేపట్టారు.

## మర్లపెండ్లికి వెళ్తూ..

- ఊడిన బొలేరా వాహనం వెనుక డోర్ కొక్కెం
- వాహనం నుంచి కింద పడిన నలుగురు
- తీవ్ర గాయాలై ఒకరు మృతి


మృతి చెందిన మహమ్మద్ రఫీ (ఫైల్)

కొత్తపల్లి: అందరూ ఆనందంగా వివాహ వేడుకను చేసుకుని మర్లపెండ్లికి బయలుదేరుతుండగా విషాదం చోటు చేసుకుంది. పాములపాడు – లింగాపురం రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. బండి ఆత్మకూరుకు చెందిన షేక్ మహమ్మద్ రఫీ(30) అనే వ్యక్తి గడివేముల మండలం మంచాలకట్ట గ్రామంలో బంధువుల పెళ్లికి వెళ్లాడు. అక్కడి నుంచి మర్లపెండ్లి నిమిత్తం బొలేరా వాహనంలో కొత్తపల్లి మండలంలోని గోకవరం గ్రామానికి బయలుదేరారు. ఈ తరుణంలో కొత్తమాడుగుల – లింగాపురం గ్రామాల మధ్య మామిడి తోట సమీపంలో వాహనం వేగంగావస్తూ స్పీడ్ బ్రేకర్ వద్ద కుదుకు బొలేరా వాహనం వెనుక డోర్ కొక్కెం ఊడీ పోయింది. దీంతో వెనుక డోర్ వద్ద కూర్చున్న రియాజ్, బాషా, వలీ, మహమ్మద్ రఫీలు కింద పడిపోయారు. వీరిలో మహమ్మద్ రఫీ తలకువెనుక భాగంలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. షేక్‌మహమ్మద్ రఫీ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం కుటుంసభ్యులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య షైమున్నీసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వీరశేఖర్

నందికొట్కూరు: కర్నూలు – ఆత్మకూరు రహదారిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు.. నందికొట్కూరు పట్టణ సమీపంలోని రబ్బానీ గోడౌన్ వద్ద రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామానికి చెందిన వీరశేఖర్ (31) మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు పోలీసులు తరలించారు. మృతుడు కర్నూలు నగరంలోని చెక్‌పోస్టు ఏరియాలో నాలుగేళ్లుగా నివాసం ఉంటున్నారు. ప్రతి రోజు కూరగాయల మార్కెట్‌కు వెళ్లి దుకాణాలకు కూరగాయలను విక్రయించేవాడు. అతని మృతి పట్ల భార్య శైలజ, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

## కర్నూలు ఫోర్త్ టౌన్‌కు మరో ఇద్దరు ఎస్ఐలు

- ఉన్నతాధికారి మౌఖిక ఆదేశాలు
- వరుస చోరీల నేపథ్యంలో విధుల్లోకి

కర్నూలు: వరుస చోరీల నేపథ్యంలో కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు మరో ఇద్దరు ఎస్ఐలను నియమించారు. ఉన్నతాధికారి మౌఖిక ఆదేశాలతో ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, సి.చంద్రశేఖర్‌రెడ్డి విధుల్లో చేరారు. స్టేషన్ పరిధి పెద్దదిగా ఉండటంతో గతంలో నాలుగు సెక్టార్లుగా విభజించి ఒక్కొక్క సెక్టార్‌కు ఒక ఎస్ఐ చొప్పున విధులు నిర్వహించేవారు. అయితే ఎన్నికలకు ముందు ఇక్కడ విధుల్లో ఉన్న ఎస్ఐలు పెద్దయ్య నాయుడు, సునీల్‌కుమార్, మధు ఇతర స్టేషన్లకు బదిలీపై వెళ్లారు. స్టేషన్ సిబ్బంది కూడా దాదాపు మూడు నెలల పాటు ఎన్నికల విధుల్లో ఉండటంతో దొంగలకు అవకాశంగా మారింది. గస్తీ విధులకు కూడా సిబ్బంది కొరత ఏర్పడటంతో శివారు కాలనీల్లో వరుస చోరీలు జరిగాయి. కొంతకాలంగా మోహన్ కిషోర్ రెడ్డి ఒక్కరే స్టేషన్ విధులు నిర్వహిస్తున్నారు. స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న బాబా బృందావన్ కాలనీలో నివాసముంటున్న శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతుల ఇంట్లో భారీ చోరీ జరిగింది. కొలిమిగుండ్ల మండలం జున్నుకమ్మరపల్లె గ్రామానికి చెందిన వీరు ఈనెల 19వ తేదీ ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లగా దొంగలు ఇంట్లోకి చొరబడి 45 తులాల బంగారం, కిలో వెండితో పాటు ఖరీదైన టీవీని తస్కరించి ఆటోలో పరారయ్యారు. 28వ తేదీన సంఘటన వెలుగులోకి రాగా, పోలీసులు పరిశీలించగా 20వ తేదీ తెల్లవారుజామున చోరీ జరిగినట్లు సీసీ ఫుటేజీలో బయటపడింది. అయితే భారీ మొత్తంలో చోరీ జరగడంతో కేసు నమోదుకు పోలీసులు తటపటాయిస్తున్నారు. దొంగ దొరికే వరకు వేచి చూద్దాం అనే ధోరణితో పోలీసులు కేసు నమోదుకు తాత్సారం చేస్తున్నట్లు బాధితులు ఆవేదన చెందుతున్నారు. కష్టపడి సంపాదించుకున్న సొమ్మంతా పోగొట్టుకుని లబోదిబోమంటూ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అదే రోజే శివప్పనగర్‌లోని శివకేశవులు, లక్ష్మీదేవి నిర్వహిస్తున్న బంగారు దుకాణంలో కూడా ఓ మహిళ ప్రవేశించి నెక్లెసు, మూడు డాలర్లు, జత కమ్మలు ఎత్తుకెళ్లింది. అలాగే వాసవీ నగర్‌లో నివాసముంటున్న అనంతకృష్ణ శర్మ ఇంట్లో కూడా రెండు రోజుల క్రితం దొంగలు పడి 12 తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. అదే స్టేషన్ పరిధిలోని చింతలముని నగర్‌లో నివాసముంటున్న నర్సింహులుకు చెందిన లారీ కూడా చోరీకి గురయ్యింది. ఇలా వరుస దొంగతనాల నేపథ్యంలో ఇద్దరు ఎస్ఐలను అక్కడ నియమిస్తూ ఉన్నతాధికారి మౌఖిక ఆదేశాలు ఇవ్వడంతో సోమవారం వారు విధుల్లో చేరారు.

**దొంగలు హైదరాబాద్ వైపు పారిపోయినట్లు సీసీ ఫుటేజీ ఆధారాలు...**

బాబా బృందావన్ నగర్‌లో చోరీ పాల్పడిన దొంగలు ఆటోలో హైదరాబాద్ వైపు పరారైనట్లు పోలీసులకు సీసీ ఫుటేజీ ఆధారాలు లభించాయి. స్టేషన్‌లో నాయక్, షాకీర్, ఖాద్రి, ఎల్లా శివుడు, సుబ్బరాయుడు తదితరులు క్రైం పార్టీ విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారి ఆదేశాల మేరకు క్రైం పార్టీ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి వరుస చోరీలకు సంబంధించిన దొంగల ఆధారాలు రాబడుతున్నారు. ఇందులో భాగంగా సీసీ కెమెరా ఫుటేజీని సేకరించగా బృందావన్ నగర్‌లో చోరీకి పాల్పడిన దొంగలు ఆటోలో హైదరాబాద్ వైపు పరారైనట్లు గుర్తించారు. హైదరాబాద్ వరకు ఉన్న అన్ని టోల్ ప్లాజాల్లో కూడా ఆటో నెంబర్ నిక్షిప్తమై ఉన్నట్లు గుర్తించి దొంగల కోసం గాలిస్తున్నారు.

### పెరుగుతున్న పత్తి సాగు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పత్తి సాగు పెరుగుతోంది. ఖరీఫ్ సాధారణ సాగు 4.19 లక్షల హెక్టార్లు ఉండగా.. జూలై 1 నాటికి 63,626 హెక్టార్ల(15.18 శాతం)లో పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా పత్తి సాగు అయింది. పత్తి సాధారణ సాగు 2.43 లక్షల హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 42,274 హెక్టార్లలో సాగు కావడం విశేషం. రానున్న 10 రోజుల్లో పత్తి సాగు భారీగా పెరిగే అవకాశం ఏర్పడింది. వేరుశనగ 6887 హెక్టార్లు, మొక్కజొన్న 2355, కంది 6523, ఆముదం 1654 హెక్టార్లలో సాగయ్యాయి.





### ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు (సిటీ): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో రెండో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కాలేజీల జిల్లా కన్వీనర్ ఆర్.కృష్ణమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని, ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుందన్నారు. ప్రభుత్వ ఐటీఐ కాలేజీల్లో దరఖాస్తు చేసుకునే వారికి ఈనెల 27, 28 ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో దరఖాస్తు చేసుకునే వారికి ఈనెల 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈనెల 25వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఆయా కాలేజీలను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.